ప్రభాత సూర్యుడు
బుధవారం - 28- ఆగష్టు - 2024

# మత్తు మందు కలిపిన నీళ్లు ఇచ్చి విద్యార్థినిపై ఆటో డ్రైవర్ అత్యాచారం

మొదటి పేజి తరువాయి

కాలేజీ నుంచి ఇంటికి వెళ్లేందుకు ఆటో ఎక్కిన ఓ నర్సింగ్ విద్యార్థినిపై డ్రైవర్ అత్యాచారానికి పాల్పడ్డాడు. మత్తు మందు కలిపిన నీళ్లు ఇచ్చి, నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి ఈ దారుణానికి తెగబడ్డాడు. ఓవైపు కోల్ కతా వైద్యురాలి హత్యాచారంపై దేశమంతటా నిరసనలు వ్యక్తం అవుతున్న వేళ ఈ ఘటన చోటుచేసుకోవడంతో మహారాష్ట్రలోని రత్నగిరిలో ఉద్రిక్తత నెలకొంది. ఈ నెల 24న జరిగిన ఈ దారుణం తాజాగా వెలుగులోకి వచ్చింది.

మాటల్లో పెట్టి మత్తు మందిచ్చి...

రత్నగిరిలో ఓ నర్సింగ్ విద్యార్థిని కాలేజీ నుంచి ఇంటికి బయలుదేరింది. అటుగా వచ్చిన ఆటోలో ఎక్కింది. ఒక్కతే ప్రయాణిస్తుండడంతో ఆటో డ్రైవర్ మంచిగా మాటలు కలిపాడు. తాగడానికి నీళ్లు ఇచ్చాడు. అయితే, అందులో అప్పటికే మత్తు మందు కలిపాడు. దాహంగా ఉండడంతో ఈ విషయం గుర్తించని విద్యార్థిని ఆ నీళ్లను తాగింది. కాసేపటికే స్పృహ తప్పింది. ఆ తర్వాత ఆటోను నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లిన డ్రైవర్.. ఆమెపై అత్యాచారం చేశాడు. తర్వాత గాయాలపాలైన యువతిని అక్కడే వదిలేసి పరారయ్యాడు. అపస్మారక స్థితిలో ఉన్న బాధితురాలిని గమనించిన స్థానికులు ఆమెను ఆసుపత్రికి తరలించారు. స్పృహలోకి వచ్చిన తర్వాత తనపై అఘాయిత్యం జరిగిందని గుర్తించిన విద్యార్థిని కుటుంబ సభ్యులకు తెలియజేసింది. వారితో కలిసి పోలీస్ స్టేషన్ వెళ్లి ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. కాగా, విద్యార్థినిపై అత్యాచారానికి పాల్పడ్డ ఆటో డ్రైవర్ ను వెంటనే అరెస్టు చేసి, కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ బాధితురాలి కుటుంబంతో పాటు డాక్టర్లు, నర్సులు, నర్సింగ్ కాలేజీ స్టూడెంట్లు ఆందోళన చేపట్టారు.

# కూల్చివేతల ఖర్చు మొత్తం మీదే.. అక్రమ నిర్మాణదారులకు హైడ్రా స్పష్టీకరణ

హైదరాబాద్ : హైదరాబాద్ లోని చెరువులను ఆక్రమించి కట్టిన నిర్మాణాలను కూల్చివేస్తూ ప్రజల అభిమానం చూరగొన్న హైడ్రా.. తాజాగా అక్రమ నిర్మాణదారులకు మరో షాక్ ఇచ్చింది. కూల్చివేతలకు అయ్యే ఖర్చు మొత్తం వారే భరించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. కూల్చివేతలకు సంబంధించి బుల్డోజర్లు, వాటికి ఇంధనం, ఆపరేటర్ కు వేతనం, కూల్చివేతల తర్వాత పోగవుతున్న వ్యర్థాల తరలింపు.. వీటికయ్యే ఖర్చు మొత్తం అక్రమ నిర్మాణదారుల నుంచే వసూలు చేస్తామని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ తేల్చిచెప్పారు. ఇందుకోసం ప్రభుత్వానికి లేఖ రాయనున్నట్లు తెలిపారు. ఆర్ఆర్ చట్టం కింద ఈ మొత్తం వ్యయాన్ని నిర్మాణదారుల దగ్గరే వసూలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరతామన్నారు.

వ్యర్థాల తరలింపునకు రూ.కోట్లలో ఖర్చు?

హైడ్రా ఇప్పటి వరకు సిటీలోని 18 ప్రాంతాల్లో 166 అక్రమ నిర్మాణాలను కూల్చివేసింది. ఇందులో పలు భారీ కట్టడాలు కూడా ఉండడంతో నిర్మాణ వ్యర్థాలు పెద్ద ఎత్తున పోగయ్యాయి. ఆక్రమణలు తొలగించడంతో పాటు చెరువులను పూర్వ స్థితిలోకి తీసుకురావడానికి తవ్వకాలు జరపాల్సి ఉంటుందని, భవిష్యత్తులో మళ్లీ కబ్జాలు జరగకుండా వాటి చుట్టూ ఫెన్సింగ్ వేయాల్సి ఉంటుందని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ చెప్పారు. వ్యర్థాల తరలింపుతో పాటు ఈ ఏర్పాట్లకు రూ.కోట్లలో ఖర్చవుతుందని ఆయన వివరించారు. అయితే, హైడ్రా వద్ద ప్రస్తుతం నిధులు ఆ స్థాయిలో లేవని ఆయన వివరించారు. ఇప్పటి వరకు జరిపించిన కూల్చివేతలకు ఇచ్చిన కాంట్రాక్టులోనే శిథిలాల తొలగింపును కూడా చేర్చామని తెలిపారు.

# మహిళల టీ20 ప్రపంచకప్... భారత జట్టు ప్రకటన!

మొదటి పేజి తరువాయి

టీ20 ప్రపంచకప్-2024కు బీసీసీఐ తాజాగా భారత జట్టును ప్రకటించింది. హర్మన్‌ప్రీత్ కౌర్ నేతృత్వంలో టీమిండియా ఈ మెగా ఈవెంట్‌లో బరిలోకి దిగనుంది. ఈ జట్టుకు వైస్ కెప్టెన్‌గా స్మృతి మంధానను ఎంపిక చేసింది బోర్డు. షఫాలీ వర్మ, దయాళన్ హేమలత, జెమిమా రోడ్రిగ్స్, దీప్తి శర్మ, రిచా ఘోష్‌లతో భారత బ్యాటింగ్ లైనప్ బలంగా ఉంది. రేణుకా సింగ్, పూజా వస్త్రాకర్, దీప్తి శర్మ, రాధా యాదవ్, ఆశా శోభనా, సజన సజీవన్‌లతో బౌలింగ్ విభాగం కూడా స్ట్రాంగ్‌గానే కనిపిస్తోంది. అటు హర్మన్‌ప్రీత్, సజన, శోభనా, దీప్తిలాంటి ఆల్‌రౌండర్లను టీమిండియా కలిగి ఉంది. భారత జట్టు: హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), స్మృతి మంధాన (వైస్ కెప్టెన్), షఫాలీ వర్మ, దీప్తి శర్మ, జెమిమా రోడ్రిగ్స్, రిచా ఘోష్ (వికెట్ కీపర్), యాస్తికా భాటియా (వికెట్ కీపర్), పూజా వస్త్రాకర్, అరుంధతి రెడ్డి, రేణుకా సింగ్, దయాళన్ హేమలత, ఆశా శోభన , రాధా యాదవ్, శ్రేయాంక పాటిల్, సజన సజీవన్.

ట్రావెలింగ్ రిజర్వ్‌లు: ఉమా చెత్రీ (వికెట్ కీపర్), తనూజా కన్వర్, సైమా ఠాకోర్.

నాన్ ట్రావెలింగ్ రిజర్వ్‌లు: రాఘ్వీ బిస్త్, ప్రియా మిశ్రా

కాగా, ఈ తొమ్మిదో ఎడిషన్ టోర్నమెంట్ అక్టోబర్ 3 నుండి 20 వరకు యూఏఈలోని దుబాయ్, షార్జా వేదికల్లో జరగనుంది. గ్రూప్-ఏలో భారత్‌తో పాటు ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, పాకిస్థాన్, శ్రీలంక జట్లు ఉన్నాయి. ఇక చివరి ఎడిషన్ టీ20 వరల్డ్ కప్‌లో కేప్‌టౌన్‌లో జరిగిన సెమీఫైనల్‌లో భారత్ 5 పరుగుల తేడాతో ఆస్ట్రేలియా చేతిలో ఓడిపోయింది.

# యుద్ధరంగంగా మారిన కోల్‌కతా రోడ్లు.. విద్యార్థులపై వాటర్ కేనన్లు, టియర్ గ్యాస్

మొదటి పేజి తరువాయి

హత్య ఘటనకు నిరసనగా 'నబన్నా అభియాన్' పేరుతో విద్యార్థులు మంగళవారంనాడు రోడ్లెక్కారు. ముఖ్యమంత్రి మమతా బెనర్జీ రాజీనామా చేయాలని, దోషులను కఠినంగా శిక్షించాలనే డిమాండ్లతో విద్యార్థి సంఘం 'పశ్చిమబంగా ఛాత్రో సమాజ్' చేపట్టిన నిరసన తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. విద్యార్థులకు, పోలీసులకు మధ్య తలెత్తిన ఘర్షణలతో కోల్‌కతా రోడ్లు యుద్ధరంగంగా మారారు. హౌరా బ్రిడ్జి నుంచి ఆందోళనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు వాటర్ కేనన్లు, బాష్పవాయువు ప్రయోగించారు. రాష్ట్ర సచివాలయం నబన్నా వరకూ విద్యార్థులు చేపట్టిన ర్యాలీని రోడ్లపైనే పోలీసులు అడ్డుకున్నారు. బారికేడ్లను బద్దలు కొట్టేందుకు ఆందోళనకారులు ప్రయత్నించారు. పోలీసులపైకి రాళ్లు రువ్వారు. ఆందోళనలు నిర్వహించేందుకు అనుమతి లేదంటూ పోలీసులు వారిని అడ్డుకుంటూ టియర్ గ్యాస్, జల ఫిరంగులను ప్రయోగించారు. కాగా, ర్యాలీలతో అశాంతిని రెచ్చగొట్టేందుకు కుట్ర జరుగుతోందంటూ అధికార తృణమూల్ కాంగ్రెస్ ఆరోపించింది. నిరసన ప్రదర్శన నేపథ్యంలో కోల్‌కతా పోలీస్ జ్యూరిష్‌డిక్షన్‌లో 25 మంది ఐపీఎస్ అధికారులతో భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. రాష్ట్ర సెక్రటరీకి దారితీసే మార్గాల్లో 30 మంది ఐపీఎస్ అధికారులతో భద్రతను కట్టుదిట్టం చేశారు. నిరసన ర్యాలీలు చట్టవిరుద్ధమంటూ జిల్లా యంత్రాగం ప్రకటించినప్పటికీ 'నబన్నా అభియాన్' ర్యాలీతో ముందుకు వెళ్లాలని పశ్చిమబంగా ఛాత్ర సమాజ్ నిర్ణయించింది. రెండు ప్రధాన ర్యాలీలను ప్లాన్ చేసింది. సెంట్రల్ కోల్‌కటాలోని కాలేజ్ స్క్వేర్ నుంచి ఒక ర్యాలీ, హౌరాలోని సాంత్రగచ్చి నుంచి మరో ర్యాలీలి తలపెట్టింది. దీంతో హౌరాలో 2,000 మంది పోలీసు సిబ్బందిని మోహరించారు. నలుగురు ఏడీజీలు, 13 మంది డీఐజీలు, 15 మంది ఎస్పీ ర్యాంక్ అధికారులు పర్యవేక్షణలో ఈ ఏర్పాట్లు చేశారు. నాలుగు వాటర్ కేనన్ ట్రక్కులను కూడా అందుబాటులో ఉంచారు. ఉదయం నుంచి పోలీసులు చేపట్టిన భద్రతా చర్యలతో కోల్‌కతా, హౌరాలో వాహనాల రాకపోకపోకలపై తీవ్ర ప్రభావం పడింది.

# సీఎం చంద్రబాబుతో నీతిఆయోగ్ ప్రతినిధుల భేటీ.. విజన్ డాక్యుమెంట్‌పై చర్చ

మొదటి పేజి తరువాయి



వికసిత్ ఏపీ -2047 రూపకల్పనపై చర్చించారు. 2047 నాటికి ఏపీని 2 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చడమే లక్ష్యమని నీతి ఆయోగ్ ప్రతినిధులకు సీఎం స్పష్టం చేశారు. అందుకే ఏపీ విజన్ డాక్యుమెంట్ సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. మాక్రో టు మైక్రో విధానం అవలంబించేలా చర్యలు తీసుకోనున్నట్లు సీఎం వెల్లడించారు. వచ్చే ఐదేళ్లకు జిల్లాల వారీగా విజన్ డాక్యుమెంట్లు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఏపీని హై వాల్యూ అగ్రీ ప్రాసెసింగ్ హబ్‌గా రూపొందించడంతోపాటు పారిశ్రామికంగా యువతలో నైపుణ్యం పెంచేలా కార్యాచరణ రూపొందిస్తున్నట్టు చెప్పారు. దేశ తూర్పుతీరానికి ఏపీని లాజిస్టిక్ హబ్‌గా తీర్చిదిద్దనున్నట్లు వెల్లడించారు. పరిశ్రమలు, పునరుత్పాదక విద్యుదుత్పత్తి కేంద్రంగా ఏపీని తీర్చి దిద్దేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఏపీని అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేలా కార్యాచరణ రూపొందిస్తున్నామన్నారు. రాష్ట్రంలోని వివిధ నగరాలను గ్రోత్‌సెంటర్లుగా మారుస్తామని, అందరికీ అత్యాధునిక వైద్యసేవలు అందేలా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. పర్యావరణ అనుకూల అభివృద్ధిపై దృష్టిపెట్టేలా ప్రణాళికలను సీఎం వివరించారు. డిజిటల్ గవర్నెన్స్, ఆర్థికాభివృద్ధికి ఏపీని ఓ నమూనాగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

# చిత్తూరుపై చంద్రబాబు మార్క్.. ఈ ఇద్దరు రెడ్లకు చుక్కలు!

మొదటి పేజి తరువాయి




అది కూడా చంద్రబాబు తన సొంత జిల్లా చిత్తూరుపైనే లెక్కలు వేసుకుని ముందుకు సాగుతున్నారు. ఈ క్రమంలో వైసీపీకి చెందిన ఇద్దరు కీలక నేతలు.. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, చెవిరెడ్డి భాస్కరరెడ్డిలకు పరోక్షంగా చెక్ పెడుతున్నారు. వీరిద్దరే.. చంద్ర బాబును కుప్పంలో ఓడిస్తామని.. ఆయనకు చుక్కలు చూపిస్తామని శపథాలు చేశారు. అయితే.. అలాంటిదేమీ జరగలేదు. కానీ, ఇప్పు డు వారే చుక్కలు చూసే పనిలో పడ్డారు. దీనికి కారణం.. చంద్రబాబు మార్కు వ్యూహాత్మక నిర్ణయాలు ఇక్కడ జరుగుతున్నా యి. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని తిరుపతి, తిరుచానూరు, చంద్రగిరి, చిత్తూరు నగరం, పలమనేరు, మదనపల్లె, పీలేరు, కాణిపాకం, బంగారుపాళ్యం, తవణంపల్లె ప్రాంతాలను మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డిలు పంచుకు న్నారు. దీంతో వారి బినామీల ద్వారా.. ఇక్కడ రియల్ ఎస్టేట్ వెంచర్లు వేయించారు. అంతేకాదు.. ఈ వ్యాపారంలోకి మరికొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులను కూడా చేర్చుకుని.. --మళ్లీ వచ్చేది మన సర్కారే%--% అంటూ వారిని నమ్మబలికి భారీగా పెట్టుబడులు పెట్టించారు. దీంతో అంతా నిజమే అనుకున్న వారు కోట్ల రూపాయల పెట్టుబడులు పెట్టి వెంచర్లు వేశారు. వీటిలో కొన్ని అసైన్డ్, అటవీ భూములు కూడా ఉన్నాయన్నది తాజా సర్కారు తేల్చిన లెక్క. ఆయా వెంచర్లు ఇంకా పూర్తిగా నిర్మాణాలకు నోచు కోలేదు. ఎందుకంటే.. ఇదంతా ఎన్నికలకు కేవలం ఆరు మాసాల ముందు మాత్రమే జరిగినట్టు తెలుస్తోంది. ప్రస్తుతం మార్కులు వేసి.. అమ్మకాలకు రెడీ చేశారు. ముందస్తు విక్రయాలు చేపట్టి.. మధ్యతరగతి జీవుల నుంచి సొమ్ములు సేకరించే ప్లాన్ వేశారు.

కానీ, పార్టీ ఎన్నికల్లో ఓడిపోయింది. దీంతో కూటమి సర్కారు పగ్గాలు చేపట్టాక.. అక్రమ లేఅవుట్లను అంతమొందించే పనికి శ్రీకారం చుట్టింది. దీంతో పంచాయితీలు, మునిసిపాలిటీలు, నగరపాలక సంస్థల నుండి ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే వేసిన ఈ లేఔట్లు వేశారు. వీటిని గుర్తించిన ప్రభుత్వం వెంచర్లలో %--%ఈ భూమి మాది%--% అంటూ సర్కారు బోర్డులు పెట్టింది. అంతేకాదు.. వీటిని కొనేవారు జాగ్రత్త పడాలని కూడా హెచ్చరించింది.

ఈ పరిణామంతో ఇప్పుడు పెద్దిరెడ్డి, చెవిరెడ్డి తర్జన భర్జన పడుతున్నారు. తమ బినామీలు కేసుల్లో ఇరుక్కుంటే.. తమ లోపాలు బయట పడతాయని భావిస్తున్నారు. మొత్తానికి చంద్రబాబు ఇచ్చిన షాక్‌తో ఇద్దరు రెడ్లు.. తల్లడిల్లుతుండడం గమనార్హం.

# కవితకు బెయిల్.. బీఆర్ఎస్ లో జోష్..ఇకపై రంగంలోకి కేసీఆర్!

మొదటి పేజి తరువాయి




కవిత అరెస్టుతో పార్టీ శ్రేణుల్లో అభద్రత భావం పెరిగి చాలామంది బిఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్, బిజెపిలలో చేరారు. మార్చి నెల నుంచి ఢిల్లీ లిక్కర్ కుంభకోణంలో అరెస్టు అయిన కవిత ఈడి, సిబిఐ కేసులలో చిక్కుకొని ఇంతకాలం తీహార్ జైల్లో నరకం అనుభవించారు.

కవిత అరెస్ట్ తో కుదేలైన బీఆర్ఎస్

ఇక తాజాగా మంగళవారం కవితకు బెయిల్ రావడంతో బిఆర్ఎస్ పార్టీకి జవసత్వాలు వచ్చినట్టయ్యింది. ఎమ్మెల్సీ కవిత అరెస్టు తర్వాత తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ దారుణంగా దెబ్బతింది. కవిత అరెస్టు తర్వాత జరిగిన లోక్సభ ఎన్నికలలో బీఆర్ఎస్ పరువు పోగొట్టుకుంది. ఢిల్లీ లిక్కర్ కుంభకోణం లో కవిత ఉండటమే తెలంగాణ రాష్ట్రంలో కెసిఆర్ పార్టీకి పెద్ద మైనస్ గా మారింది.

కవిత బయటకు వచ్చాకే కేసీఆర్ అసలు రాజకీయం

ఈ క్రమంలో కేసీఆర్ కూడా పెద్దగా ప్రజల్లోకి రావడానికి ఆసక్తి చూపించలేదు. అడపాదడపా బయటకు వచ్చి కొన్ని సమస్యల పైన ప్రభుత్వాన్ని ప్రశ్నించారే తప్ప ప్రజాక్షేత్రంలో తిరిగి ప్రజల మద్దతు కోసం కూడా ప్రయత్నించలేదు. పార్టీ నుండి బయటకు వెళ్లే వాళ్లను ఆపనూ లేదు. కవిత బెయిల్ పై బయటకు వచ్చిన తర్వాత కేసీఆర్ అసలు రాజకీయం మొదలు పెడతారని చర్చ జరిగింది.

సమరానికి సిద్ధంగా కేసీఆర్

తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ను, కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపిని టార్గెట్ చేయాలని భావించిన కేసీఆర్ ఇప్పుడు రంగంలోకి దిగుతారని పార్టీ శ్రేణుల్లో చర్చ జరుగుతుంది. బిడ్డ జైలులో ఉంటే తన గుండెల్లో అగ్నిపర్వతం బద్దలవుతోందని అయినా ఓపికగా ఎదురుచూస్తున్నానని చెప్పిన కేసీఆర్ ఇప్పుడు తెలంగాణ రాష్ట్రంలో అధికార కాంగ్రెస్ పైన, దేశంలో అధికారంలో ఉన్న ఎన్డీఏ సర్కార్ పైన సమర శంఖాన్ని పూరిస్తారని భావిస్తున్నారు.

**పార్టీ శ్రేణుల్లో జోష్**

ఆరు నెలల 11 రోజులు తీహార్ జైల్లో ఉన్న కవిత మొత్తం 153 రోజులు జైలు జీవితాన్ని అనుభవించి బెయిల్ పైన బయటకు వస్తున్నారు. ఇక కవిత రాక కెసిఆర్ కు, బిఆర్ఎస్ పార్టీకి బిగ్ రిలీఫ్. మళ్లీ కవిత ఎంట్రీ తో కేసీఆర్ తన రాజకీయ చతురతకు పదును పెడతారని పార్టీ శ్రేణులలో నూతన ఉత్సాహం కనిపిస్తుంది.

# రేవంత్ అర్జునుడా? అభిమన్యుడా?

మొదటి పేజి తరువాయి

సరైన జాగ్రత్తలు తీసుకోకుండా చేతిలో ఉన్న కర్రతో నో.. రాయితోనో దాన్ని టార్గెట్ చేస్తే.. తొలుత ఇబ్బందికి గురయ్యేది.. తేనెతుట్టను టార్గెట్ చేసినోడే. ఈ చిన్న విష యాన్ని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మిస్ అయ్యారా? అన్నదిప్పుడు హాట్ టాపిక్ గా మారింది. రేవంత్ కు ముందు ముఖ్యమంత్రిగా వ్యవహరించిన కేసీఆర్ ను తీసుకుంటే.. ఆయన పదేళ్ల పాలనలోనూ.. దానికి ముందు ఉమ్మడి రాష్ట్రంలోని ఎంతో మంది ముఖ్యమంత్రులు తొందరపడని ఒక అంశం మీద రేవంత్ దూసుకెళ్లిపోవటం.. బుల్డోజర్ల తరహాలో వ్యవహరిస్తున్న హైడ్రా వ్యవహారం ఇప్పుడు సంచలనంగా మారింది. అక్రమార్కుల అక్రమాల విషయంలో వేలు పెట్టటాన్ని ఎవరూ తప్పు పట్టరు. ఎందుకుంటే.. ఎవరో ఒకరు ఎక్కడో ఒక దగ్గర కల్పించుకోవాల్సిందే. కానీ.. దానికి అవసరమైన ఆయుధాల్ని సిద్ధం చేసుకొనే రేవంత్ హైడ్రాను రంగంలోకి దించారా? అన్నది అసలు ప్రశ్న. చెరువుల్ని కాపాడటమే తమ ధ్యేయంగా.. చెరువు ఆయుకట్టలను సంరక్షించటమే లక్ష్యంగా హైడ్రా అనే వ్యవస్థను తెర మీదకు తీసుకొచ్చారు. అంతవరకు బాగానే ఉన్నా.. అక్రమ కట్టడాల్ని నిర్ధిరించటం.. ఆ వెంటనే కొట్టేయటం లాంటి అంశాల్లో న్యాయపరమైన చర్యల్ని సైతం హైడ్రానే తీసుకోవటం.. వెనుకా ముందు చూసుకోకుండా విరుచుకుపడటం ఇప్పటివరకు చూస్తున్నాం. ఇక్కడే పెద్ద తలనొప్పి ఉంది. చెరువుల ఎఫ్ టీఎల్.. బఫర్ జోన్ లకు సంబంధించిన సమాచారాన్ని ఆధారంగా చేసుకొని అనుమతి లేని నిర్మాణాలను కూల్చేస్తున్న హైడ్రా.. కొన్ని వ్యవస్థలు (అది హెచ్ ఎండీఏ కావొచ్చు జీహెచ్ఎంసీ కావొచ్చు) అనుమతులు ఇచ్చిన తర్వాత నిర్మించిన వాటిపైనా విరుచుకుపడటం ప్రశ్నగా మారింది. ఒకరు చేసిన తప్పునకు వేరే వారు ఎందుకు బలి కావాలి? అన్నది ఇక్కడ ప్రాథమిక ప్రశ్న. ఒక వ్యవస్థకు చెందిన ఒక విభాగం ఇచ్చిన అధికారిక అనుమతుల్ని అసరాగా చేసుకొని నిర్మాణం చేసినప్పుడు.. ఇప్పుడు అదే వ్యవస్థకు చెందిన మరో విభాగం వచ్చి మీరు చేసింది తప్పు అంటూ.. కూల్చేసేందుకు అవసరమైన తీర్పును ఇన్ స్టెంట్ గా ఇచ్చేయటంపై అభ్యంతరం వ్యక్తమవుతోంది. సంపన్నులైనా.. సామాన్యులైనా ఒకే తీరును ప్రదర్శిస్తామని చెబుతున్న హైడ్రాను నడిపిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విచిత్రమైన పరిస్థితుల్లో ఉన్నట్లుగా చెబుతున్నారు. ఆయన తీసుకొచ్చిన హైడ్రాను కురుక్షేత్ర యుద్ధంగా పేర్కొంటూ.. అందులో పోరాటం చేస్తున్న రేవంత్ ను కొందరు అర్జునుడిగా పోలుస్తుంటే.. మరికొందరు అభిమన్యుడిగా వ్యవహరిస్తున్నారు. కురుక్షేత్రంలో పద్మ వ్యూహాన్ని ఛేధించే శక్తి ఉన్న ఈ ఇద్దరిలో.. అభిమన్యుడికి వెళ్లటం వరకు తెలుసు. తిరిగి రావటం తెలీదు. అదే సమయంలో అర్జునుడికి రెండు తెలిసినా.. వెళ్లి వచ్చే వరకు వెళ్లరు. ఇక్కడ రేవంత్ వెళ్లటం వరకైతే వెళ్లిపోయారు. ఆ తర్వాతేమిటి? అన్నదిప్పుడు ప్రశ్నగా మారింది. ఇదే అంశాన్ని సీపీఎం నారాయణ తనదైన శైలిలో చెబుతూ.. హైడ్రా పేరుతో రేవంత్ రెడ్డి పులిస్వారీ మొదలు చేశారని..

దాన్ని కొనసాగిస్తారో.. లేదన్నది ఆయనపైనే ఉంటుందని చెబుతున్నారు. స్వారీ ఆపకుంటే పులికి ఆహారం కావాల్సి ఉంటుందని.. కొనసాగింపు అంత తేలికైనది కాదన్న వాదనను వినిపిస్తున్నారు. సమాజంలో అత్యంత బలవంతులతో యుద్ధానికి దిగే విషయంలో వెనుకా ముందు ఆడకుండా నిర్ణయం తీసుకోవటం వరకు సరే. కానీ.. అలా తీసుకునే ముందు న్యాయపరమైన చిక్కులు ఎదురు కాకుండా అవసరమైన ప్లానింగ్ ఎంతమేర ఉందన్న దానిపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అదే రేవంత్ పై కొత్త సందేహాలు వ్యక్తం చేసేలా మారాయి. ఆ భావనే ఆయన్ను కొందరు అభిమన్యుడిలా పోలుస్తున్నారు. మరికొందరు మాత్రం ఆయన్ను అర్జునుడిగా పోలుస్తూ..వీరతాళ్లు వేస్తున్నాయి. ఇప్పుడేం జరుగుతుందన్నది కాలమే డిసైడ్ చేస్తుందని చెప్పక తప్పదు.

# కొనసాగుతున్న కాళేశ్వరం కమిషన్ విచారణ

మొదటి పేజి తరువాయి

మేడిగడ్డ ప్రాజెక్టు కుంగుబాటుకు కారణం రాఫ్ట్ కింద పలు సమస్యల వల్ల జరిగింది అన్నట్లు మిషన్ ముందు ఇంజనీర్లు చెప్పారు. సిఖెండ్ ఫైల్స్, అలాట్మెంట్ డివియేషన్ వల్ల సమస్య వచ్చింది అన్నట్లు ఇంజనీర్ సత్యనారాయణ రెడ్డి తెలిపారు. డిజైన్ల అప్రూవల్ తర్వాత అన్నారం గ్యారేజీ మోడిఫికేషన్ జరిగిందని కమిషన్‌ముందు ఇంజనీర్ ఒప్పుకున్నారు.అయితే రామగుండం ఈసీ లేఖపై మాత్రం కమిషన్ ముందు ఇంజనీర్ దయాకర్ రెడ్డి స్పష్టత లేని సమాధానం చెప్పినట్లు తెలుస్తోంది. హై పవర్ కమిటీలో సీడీఓ అధికారులు సభ్యులుగా ఉన్నారు అని ఇంజనీర్లు ఒప్పుకున్నారు. డిజైన్లు తయారు చేసే ముందు సైట్ విజిట్ ఖచ్చితంగా చేయనక్కర్లేదు అని కమిషన్ ముందు వారు చెప్పారు. అన్నారం సుందిళ్ల బ్యారేజీల లొకేషన్ మారినట్లు కమిషన్‌కు అధికారులు చెప్పారు. అయితే మేడిగడ్డ లొకేషన్ మారలేదని తాజా మాజీ ఇంజనీర్లు.. కమిషన్ ముందు స్పష్టం చేశారు. సీడీఓ - ఎల్అండ్‌టీ వేరువేరుగా డిజైన్లు తయారుచేసి ఫైనల్ అప్రూవల్‌కు అన్ని ఒకే దగ్గర చేసినట్లు ఇంజనీర్లు తెలిపారు. మూడు బ్యారేజీలకు సంబంధించి డిజైన్లలో ఎలాంటి సమస్య లేదని నిబంధనల ప్రకారమే డిజైన్లు ఉన్నాయని ఇంజనీర్లు వెల్లడించారు. మరోవైపు మాజీ జల వనరుల అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మెన్ వి ప్రకాష్ బీఆర్కే భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. 37 లక్షల ఎకరాలకు నీళ్లు ఇచ్చేందుకు కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం జరిగిందన్నారు. రఘు, వేధిర్ శ్రీరామ్ సీడబ్ల్యూసీ అంశాలను వక్రీకరించారని తెలిపారు. తాను కమిషన్ ముందు అఫిడవిట్ దాఖలు చేశానన్నారు. తుమ్మిడిహట్టి నిర్మాణం సాధ్యం కాదు అని వివరాలు ఇచ్చినట్లు తెలిపారు. తుమ్మడిహెట్టిపై కాగ్ ఆక్షేపాలను కమిషన్‌కు తెలియజేసినట్లు చెప్పారు. అఫిడవిట్ పరిశీలన తరువాత మళ్ళీ పిలుస్తామని కమిషన్ అన్నదన్నారు. నిజమైన దోషులకు శిక్ష పడాలి అనేదే తమ ఉద్దేశమని వి.ప్రకాష్ పేర్కొన్నారు.

# గణేష్ నవరాత్రి ఉత్సవాలపై సమీక్ష.. నిర్వాహకులకు మంత్రి పొన్నం కీలక హెచ్చరిక



హైదరాబాద్ : జంట నగరాల్లో గణేష్ నవరాత్రి ఉత్సవాలపై నిర్వాహకులతో మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లోని గణేష్ ఉత్సవ ఏర్పాట్లపై ఆరా తీయాలని అధికారులను ఆదేశించారు. మండపాల వద్ద ఏర్పాట్లతో పాటు ప్రజలు తీసుకుంటున్న చర్యలపైనా దృష్టి పెట్టాలని అన్నారు. గతంలో రంజాన్, మొహర్రం, బోనాలు విజవంతంగా జరుపుకున్నాం.. ఇప్పుడు 11 రోజుల పాటు జరిగే గణేష్ ఉత్సవాలు కూడా ఘనంగా జరుపుకోవాలని సూచించారు. సోషల్ మీడియాలో ఏదైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా పోస్టులు పెడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి, ఖైరతాబాద్, బాలాపూర్ ఉత్సవ కమిటీలకు అన్ని రకాలుగా సహకరిస్తామని భరోసా ఇచ్చారు. ఈ 11 రోజుల పాటు జీహెచ్ఎంసీ, పోలీస్, విద్యుత్, ఫైర్, రవాణా శాఖ, మెట్రో ఇతర విభాగాలు సమన్వయం చేసుకోవాలని సూచించారు. ఆర్టీసీ ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తుందని చెప్పారు. మెట్రో వేళలు సైతం పొడిగిస్తారని అన్నారు. రోడ్లపై మొబైల్ టాయిలెట్స్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. క్రేన్‌లకు ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. నిమజ్జనంలోనూ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా జగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. 40 సంవత్సరాలుగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా జరుగుతున్నాయి.. ఈసారి మరింత ఘనంగా జరుపుకోవాలని సూచించారు.

# సీఎం సొంత జిల్లాలో స్కామ్, రంగంలోకి దిగిన సీఐడీ, విజయవాడలో ఫైల్స్ ఉన్నాయా ?

మొదటి పేజి తరువాయి




ఇదే సమయంలో రంగంలోకి దిగిన సీఐడీ అధికారులు ఇసుక స్కామ్ వ్యవహారంలో దర్యాప్తు వేగవంతం చేశారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సొంత జిల్లా చిత్తూరులోనే ఇసుక స్కామ్ వ్యవహారంపై సీఐడీ అధికారులు దృష్టి సారించారు. సబ్ కలెక్టర్ ఆఫీసులోకి సీఐడీ చీఫ్ ఎంట్రీ, సీన్ రీ కనస్ట్రక్షన్, రాత్రి ఏం జరిగింది చెప్పండి ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 32 మండలాల్లో ఇసుకను విక్రయించడానికి అప్పటి వైసీపీ ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. 2022 డిసెంబర్ నుండి 2023 ఆగస్టు వరకు జేపీ వెంచర్స్ లిమిటెడ్ సంస్థకి, ఆ తర్వాత ప్రతిమా ఇన్ ఫ్రా సంస్థలకి చిత్తూరు జిల్లాలో ఇసుక విక్రయించడానికి అప్పటి వైసీపీ ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. అయితే 2024 సంవత్సరంలో చిత్తూరు జిల్లాలో ఇసుకను విక్రయించడానికి అప్పటి జగన్ ప్రభుత్వం ఏ సంస్థకు అనుమతులు ఇవ్వలేదని రికార్డులు చెబుతున్నాయని సీఐడీ అధికారులు అంటున్నారు. 2024లో కూడా ఉమ్మడి చిత్తూరు జిల్లాలో లక్షల టన్నుల ఇసుకను బయటకు తీసి విక్రయించారని ఆరోపణలు ఉన్నాయి. ఇదే విషయంపై నివేదిక ఇవ్వాలని సీఐడీ అధికారులు చిత్తూరు జిల్లా గనుల శాఖ అధికారులకు సూచించారు. అయితే రికార్డులు మొత్తం విజయవాడలోని గనుల శాఖ ప్రధాన కార్యాలయంలో ఉన్నాయని, సంబంధిత పత్రాలు కూడా అక్కడే ఉన్నాయని, నివేదిక సమర్పించడానికి సమయం కావాలని చిత్తూరు జిల్లా గనుల శాఖ అధికారులు సీఐడీ అధికారులకు మనవి చేశారని తెలిసింది.

కలలో కూడా అనుకోలేదు అడ్డంగా బుక్కైపోతాడని, వైసీపీ ఎమ్మెల్సీ వీడియో నిజమేనా ?

ఆన్ లైన్ లోనే ఎక్కువ శాతం ఇసుక విక్రయించామని ఇంతకాలం పదే పదే గొప్పలు చెప్పుకున్న గత వైసీపీ ప్రభుత్వం నాయకులు ఇప్పుడు అదే ఇసుక విక్రయాల గురించి ఆన్ లైన్ లో సమాచారం పెట్టలేదా అని ప్రజలకి అనుమానం వస్తోంది. చిత్తూరు జిల్లా గనుల శాఖలో జరిగిన అక్రమాలపై సీఐడీ అధికారులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారని, మొత్తం సమాచారం బయటకు లాగుతున్నారని సమాచారం. గత వైసీపీ ప్రభుత్వంలో తూతూ మంత్రంగా అనుమతులు తీసుకున్న జేపీ వెంచర్స్ ప్రతిమా ఇన్ ఫ్రా సంస్థలు అక్రమంగా ఇసుకను విక్రయించి భారీ మొత్తంలో సొమ్ము చేసుకున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారంపై ఆంధ్రప్రదేవ్ సీఐడీ అధికారులు పూర్తి సమాచారం బయటకు లాగుతున్నారు. చంద్రబాబు నాయుడు సొంత జిల్లా చిత్తూరులో ఎంత మొత్తంలో ఇసుక విక్రయించారు అని సీఐడీ అధికారులు ఆరా తీస్తున్నారు.

## పీఎం మోడీ, వైట్ హౌస్ పరస్పర విరుద్ధ ప్రకటన..



**న్యూఢిల్లీ,:** రెండేళ్ల నుంచి రష్యా-ఉక్రెయిన్ యుద్ధం జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఇటీవల ప్రధాని నరేంద్రమోడీ ఉక్రెయిన్ పర్యటనకు వెళ్లడం చర్చనీయాంశంగా మారింది. ఉక్రెయిన్ ప్రెసిడెంట్ జెలెన్స్కీతో ప్రధాని మోడీ భేటీ అయ్యారు. సంక్షోభాన్ని దౌత్యం, చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని మరోసారి ప్రధాని పునరుద్ఘాటించారు. ఇదిలా ఉంటే, ఈ పర్యటన తర్వాత ప్రధాని మోడీ అమెరికి ప్రెసిడెంట్ జో బైడెన్‌తో మాట్లాడారు. బంగ్లాదేశ్ సంక్షోభం, మైనారిటీల భద్రత, ముఖ్యంగా హిందువుల భద్రతపై ఇరువురం చర్చించినట్లు ప్రధాని ఎక్స్ వేదికగా ప్రకటించారు. అయితే, వైట్‌హౌజ్ ప్రకటనలో మాత్రం బంగ్లాదేశ్ పరిస్థితి, షేక్ హసీనా బహిష్కరణకు సంబంధించి ఎలాంటి ప్రస్తావన లేదు. వైట్‌హౌజ్ ప్రకటనలో వచ్చే నెల సెప్టెంబర్‌లో జరిగే ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ సమావేశాల గురించి, ఇటీవల ఉక్రెయిన్ పర్యటన గురించి చర్చించినట్లు తెలిపింది. ప్రధాని మోడీ శాంతి కార్యక్రమాలను ప్రశంసించింది. "దశాబ్దాల్లో ఒక భారత ప్రధానమంత్రి పోలాండ్ మరియు ఉక్రెయిన్‌లలో చేసిన చారిత్రాత్మక పర్యటనని, ఉక్రెయిన్‌కు శాంతి సందేశం, కొనసాగుతున్న మానవతా మద్దతు కోసం ప్రధాని మోడీ చొరవ చూపడంపై బైడెన్ ప్రశంసించారు" అని ప్రకటన పేర్కొంది. యూఎన్ చార్టర్ ఆధారంగా అంతర్జాతీయ చట్టాలకు అనుగుణంగా సంఘర్షణకి శాంతియుత పరిష్కారాన్ని ఇరువురు నేతలు మద్దతు ఇచ్చారని తెలిపింది.చైనా గురించి ప్రస్తావించకుండా, వైట్ హౌస్ ప్రకటన క్వాడ్‌పై చర్చించినట్లు తెలిపింది. ఇండో-పసిఫిక్‌లో శాంతి, శ్రేయస్సుకు దోహదపడేందుకు క్వాడ్ వంటి ప్రాంతీయ కూటములతో కలిసి పనిచేయడానికి నాయకులు తమ నిరంతర నిబద్ధతను నొక్కి చెప్పినట్లు తెలిపింది.

## ఈసీని కలిసిన వైసీపీ బృందం.. ఆ బాధ్యత ఈసీదే..



అమరావతి: సచివాలయంలో ఎన్నికల ప్రధానాధికారిని కలిసింది వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ బృందం.. ఏపీ సీఈవోను కలిసిన టీమ్‌లో.. మాజీ మంత్రులు అంబటి రాంబాబు, మెరుగ నాగార్జున, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు తదితర నేతలు ఉన్నారు.. ఈ సందర్భంగా అంబటి రాంబాబు మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా మే 13వ తేదీన ఎన్నికలు జరిగితే జూన్ 4వ తేదీన ఎన్నికల ఫలితాలు వచ్చాయి. కూటమి గెలుపు షాక్ ఇచ్చింది.. మొదట నమ్మలేకపోయాం అన్నారు. అయితే ఓట్ ఫర్ డెమాక్రసీ అనే సంస్థ పోలింగ్‌పై అనుమానాలు వ్యక్తం చేసింది. భారత ఎన్నికల సంఘం ఈ అనుమానాలు నివృత్తి చేయాలన్నారు. ఏ లోపం లేకుండా ఎన్నికలు జరిగాయని చెప్పాల్సిన బాధ్యత ఈసీకి ఉందన్న ఆయన.. ఎన్నికలయ్యాక ఏపీలో 68.12 శాతం పోలింగ్ పూర్తి అయిందని ఈసీ చెప్పింది. తర్వాత 76.5 శాతానికి పెరిగింది. ఫైనల్‌గా 80.66శాతంగా ప్రకటించారు. కౌంటింగ్ సమయంలో 82 శాతం పోలింగ్ జరిగినట్లుగా ఈసీ చెప్పిందన్నారు. అయితే, ఎన్నికల సంఘం ఈ అనుమానాలు క్లియర్ చేయాలి. ఇవాల్టి వరకు ఫామ్-20 అంటే ఏ నియోజకవర్గంలో ఎన్ని ఓట్లు.. ఎవరికి పోల్ అయ్యాయని చెప్పలేదన్నారు అంబటి రాంబాబు.. ఇదోక అసాధారణమైన చర్య.. ఎందుకు ఆలస్యం అయింది. ఫైనల్ ఫిగర్‌కి కౌంటింగ్ ఫీగర్‌కి ఎందుకు తేడా వచ్చింది.. ఇది దురదృష్టం. ఎన్నికల నిర్వహణ పై అనేక అనుమానాలు ఉన్నాయి అన్నారు మాజీ మంత్రి అంబటి రాంబాబు.. మరోవైపు.. 2024 ఎన్నికల ప్రొసీజర్ సరైన క్రమంలో లేదు.. పార్లమెంటరీ వ్యవస్థలో ఈసీ రాజ్యాంగబద్ధ సంస్థ. ఏపీలో ఎన్నికలు జరిగిన తీరు.. విధానం అనుమానాలుకు తావిచ్చేలా ఉంది అన్నారు మాజీ మంత్రి మెరుగు నాగార్జున%ా% ఈసీ వెంటనే స్పందించాలి. ఎన్నికల శాతం ప్రకటన అనుమానాస్పదంగా ఉంది. ఎన్నికల శాతం పెంచుకుంటూ వెళ్లారు అని ఆరోపించారు మెరుగు నాగార్జున.

## ఎమ్మెల్సీ కవితకు బెయిల్..



న్యూఢిల్లీ: ఎమ్మెల్సీ కవిత బెయిల్ పిటిషన్ పై ఉత్కంఠకు తెరపడింది. ఢిల్లీ లిక్కర్ స్కామ్ సీబీఐ, ఈడీ కేసుల్లో కవితకు బెయిల్ మంజూరైంది. ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో అరెస్టయిన కవిత 166 రోజులు తిహార్ జైలులో ఉన్నారు. కవిత బెయిల్ పై ఇవాళ సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. కవిత బెయిల్ పిటిషన్‌పై జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. ఢిల్లీ లిక్కర్ కేసులో విజయ్ నాయర్ బెయిల్ పిటిషన్ పై విచారణ వాయిదా పడడంతో కవిత బెయిల్ పిటిషన్ ఏమవుతుందోనని బీఆర్ ఎస్ శ్రేణుల్లో ఆందోళన నెలకొంది. ఎట్టకేలకు రెండు కేసుల్లోను కవితకు బెయిల్ రావడంతో అందరూ బీఆర్‌ఎస్ శ్రేణులు ఊపిరి పీల్చుకున్నారు. కవిత తరపున ముకుల్ రోహత్గీ వాదించారు. ఈ కేసులో సహ నిందితుడు మనీష్ సిసోడియాకు బెయిల్ మంజూరైంది. ఈ కేసులో ఇప్పటికే ఈడీ, సీబీఐ చార్జిషీటు దాఖలు చేశాయి. ఇప్పటికే దీనిపై విచారణ పూర్తయింది. ఈ కేసులో 57 మంది నిందితులు ఉన్నారు. ఢిల్లీలో సంచలనం సృష్టించిన మద్యం కేసులో కవితను మార్చి 16న ఈడీ అరెస్ట్ చేసింది. ఆ సమయంలో మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద అరెస్టు చేసినట్లు ఈడీ ప్రకటించింది. విచారణ అనంతరం ఆమెను తీహార్ జైలుకు తరలించారు. అప్పటి నుంచి ఆమె తీహార్ జైలులో ఉన్నారు. ఈ కేసులో 493 మంది సాక్షులను విచారించినట్లు పేర్కొంది. సిసోడియాకు ఇచ్చిన బెయిల్ షరతులు కవితకు కూడా వర్తిస్తాయని ముకుల్ రోహత్గీ తెలిపారు. కవిత ఫోన్‌లలోని డేటా ఉద్దేశపూర్వకంగా ఫార్మాట్ చేయబడిందని ఈడీ తరపు న్యాయవాది పేర్కొన్నారు. అసలు విచారణకు కవిత సహకరించడం లేదన్నారు. ఫోన్‌లలో సందేశాలను తొలగించడం సహజమేనా అని ధర్మాసనం ప్రశ్నించింది. ఈడీ తరపు న్యాయవాది ఎస్వీ రాజు మాట్లాడుతూ.. ఫోన్‌లో డేటా ఎక్కువగా ఉన్నప్పుడు డిలీట్ అవుతుందని, ఫార్మాట్ చేయడం లేదని అన్నారు. సాక్షులను బెదిరించినట్లు చెబుతున్నారని, అయితే ఎక్కడా కేసు నమోదు కాలేదని ముకుల్ రోహత్గీ తెలిపారు. 'కవిత్వం నిరక్షరాస్యుడు కాదు. ఏది మంచిదో ఏది కాదో తెలియదా? ఆమోదించిన వ్యక్తి ప్రకటనను ఎందుకు ఉపసంహరించుకున్నారు?' అని జస్టిస్ గవాయ్ ప్రశ్నించారు.కవితకు సెక్షన్ 45 ఎందుకు వర్తించదని జస్టిస్ గవాయ్ ఈడీ, సీబీఐ తరపు న్యాయవాదులను ప్రశ్నించారు. కవిత వల్ల అరుణ్ పిళ్లై ప్రభావితుడయ్యాడని అంటున్నారు. అయితే ఆ సమయంలో పిళ్లై జైలులో ఉన్నారు. దాని ప్రభావం ఎలా ఉంటుంది?' అని ఈడీ తరపు న్యాయవాదిని ధర్మాసనం ప్రశ్నించింది. 'అవును. ఆ సమయంలో పిళ్లై జైలులో ఉన్నారు. అయితే ఇది జైలులో ఉన్నవారిని కూడా ప్రభావితం చేస్తుంది. కుటుంబ సభ్యులు, న్యాయవాదులు వారిని జైలులో పరామర్శిస్తూనే ఉన్నారు. వారిని ప్రభావితం చేయవచ్చు" అని ఈడీ తరపు న్యాయవాది ఎస్వీ రాజు అన్నారు.సుప్రీంకోర్టులో కవిత బెయిల్ కేసు విచారణ సందర్భంగా బీఆర్ఎస్ నేతలు, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్ రావు, వేముల ప్రశాంత్ రెడ్డి, ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి, ఎమ్మెల్సీ.శేరి సుభాష్ రెడ్డి,ఎంపీ వావీరాజు రవిచంద్ర, ఇతర నాయకులు కోర్టుకు హాజరయ్యారు.

## ఆక్రమణదారులకు మంత్రి స్ట్రాంగ్ వార్నింగ్..
## స్వచ్ఛందంగా స్వాధీనం చేయండి.. లేదా..



అమరావతి:ప్రభుత్వ భూముల ఆక్రమణ దారులకు ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. విశాఖపట్నం పర్యటనలో ఉన్న ఆయన.. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మున్సిపాలిటీల్లో ఆక్రమణకు గురైన భూములను స్వచ్ఛందంగా స్వాధీనం చెయ్యాలన్నారు.. లేదంటే ప్రభుత్వం ఆ పని చేస్తుందని స్పష్టం చేశారు. ఇక, వచ్చే నెలాఖరులోగా టీడీఆర్ బ్లాండ్లపై స్పష్టత వస్తుందని బాధ్యులపై చర్యలు తప్పవన్నారు నారాయణ. మరోవైపు, రుషికొండ భవనాలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టి సారించారని, వాటి వినియోగంపై అందరి అభిప్రాయాలు తీసుకుని తుది నిర్ణయం ఉంటుందని వెల్లడించారు. కాపాలుప్పాడ డంపింగ్ యార్డ్ నిర్వహణ , సాలీడ్ వెస్ట్ మేనేజిమెంట్ ప్లాంట్ పనితీరు పరిశీ లించిన మునిసిపల్ శాఖమంత్రి నారాయణ.. వైసీపీ ప్రభుత్వంలో అన్ని వ్యవస్థలు నిర్వీర్యం అయ్యాయి అన్నారు. గత ఐదేళ్లలో ఒక్క మంత్రి ఈ ప్లాంట్‌ను పరిశీలించలేదు. రెండు నెలలు నుంచి మునిసిపల్ శాఖ ను చూస్తే అస్తవ్యస్తంగా చేశారన్నారు. ఇక, 15 వ ఫైనాన్స్ కమిషన్ కు మాచింగ్ గ్రాంట్ ఇవ్వలేదు. వైసీపీ హయాంలో 2023 లో 450 కోట్లు ఇస్తే వాటిని పక్కదారి పట్టించారని విమర్శించారు నారాయణ.. స్వచ్ఛ భారత్ లో 295 కోట్లు రావాలి, మాచింగ్ గ్రాంట్ 120 కోట్లు ఇవ్వలేదు.. మళ్లీ కూటమి ప్రభుత్వంవచ్చాక వాటిని వచ్చేలా చేసినట్టు వివరించారు. టీడీఆర్ కుంభకోణాలు మీద త్వరలో స్పష్టత వస్తుందన్నారు. సెప్టెంబర్ 13 న మరో 75 అన్న కాంటీన్లు ప్రారంభిస్తామని వెల్లడించారు ఏపీ మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ.

## ఫీజుల దోపిడీ పై ప్రశ్నించిన పిడిఎస్‌యు విద్యార్థి నాయకుల పై

# అక్రమ కేసులు మోపడం సిగ్గుచేటు.

### రేపు రాష్ట్ర వ్యాప్తంగా శ్రీచైతన్య విద్యాసంస్థల ఎదుట ఆందోళనలకు పిలుపు



సిద్దిపేట అర్బన్ - ప్రభాత సూర్యుడు : ఫీజుల దోపిడీ పై ప్రశ్నించిన పిడిఎస్‌యు విద్యార్థి నాయకుల పై అక్రమ కేసులు మోపడం సిగ్గుచేటుశ్రీచైతన్య విద్యాసంస్థల్లో జరుగుతున్న ఫీజుల దోపిడీ పై ప్రశ్నించిన పిడిఎస్‌యు విద్యార్థి నాయకుల పై శ్రీచైతన్య యాజమాన్యం అక్రమ కేసులు పెట్టించడం సిగ్గుచేటు.తెలంగాణ రాష్ట్రంలో శ్రీచైతన్య యాజమాన్యానికి,వారి ఆగడాలకు అడ్డు అదుపు లేకుండా పోయింది,నిబంధనల్ని ఉల్లంఘించి ఎంతైనా,ఏమైనా చేయగలుగుతామనే స్థితిలోకి వెళ్ళారు. వారి ర్యాంకుల కోసం ఎంతోమంది విద్యార్థులను మానసికంగా ఇబ్బందులకు గురిచేసి ఎంతోమంది విద్యార్థుల చావులకు ప్రత్యక్షంగా కారణం అయ్యారు.విద్యార్థులు చనిపోయాక వారి ప్రాణాలకు వెలకట్టడం వీరికి సాధరమైపోయింది. శ్రీచైతన్య విద్యాసంస్థల్లో జరుగుతున్న ఫీజుల దోపిడీ పై,అవినీతి పై ఈడి, సిబిఐ దర్యాప్తు సంస్థలతో విచారణ చేపట్టాలనీ మరియు 2015-2016 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లను నిలిపి వేయాలని డిమాండ్ చేస్తూ ఈరోజు రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలకు పిలుపునిచ్చాము.దీనిలో భాగంగా కరీంనగర్ లో ఎలాంటి ప్రభుత్వ అనుమతి లేకుండా లక్షల్లో ఫీజులు తీసుకుంటూ నిర్వహిస్తున్న శ్రీచైతన్య పాఠశాల ఎదుట ఆందోళన చేసిన పిడిఎస్‌యు జిల్లా ప్రధాన కార్యదర్శి రాణా ప్రతాప్ తో పాటు 8మంది విద్యార్థి నాయకులను కరీంనగర్ టూ టౌన్ పోలీసులు అరెస్టు చేశారు.అనంతరం ఎసిపి ఆఫీసుకు తీసుకెళ్లగా కరీంనగర్ ఎసిపి నరేందర్ విద్యార్థి నాయకులను ఇష్టమొచ్చిన పద్ధతిలో అసభ్యంగా మాట్లాడాడు, టూ టౌన్ సిఐ గన్ మెన్ పరశరాము విద్యార్థి నాయకులను కొట్టాడు.ఫీజుల దోపిడీ పై పోరాడుతున్న విద్యార్థి నాయకుల పై పోలీసులు ఈ విధంగా ప్రవర్తించడం,శ్రీ చైతన్య యాజమాన్యానికి గులంగిరి చేస్తూ 8 సెక్షన్ల కింద 9 మంది విద్యార్థి నాయకుల పై అక్రమంగా కేసులు పెట్టారు.ఈ చర్యను పిడిఎస్‌యు తెలంగాణ రాష్ట్ర కమిటీగా తీవ్రంగా ఖండిస్తున్నాం. అదే విధంగా మంచిర్యాలలో విద్యార్థి నాయకుల పై బయటి వ్యక్తులకు మద్యం తాగించి భౌతిక దాడి చేపించారు .ఇది హేయమైన చర్య.అక్రమ కేసులతో, నిర్బంధాలతో విద్యార్థి ఉద్యమాన్ని ఆపలేరని పోలీసులకు, శ్రీ చైతన్య యాజమాన్యానికి స్పష్టం చేస్తున్నాం. తక్షణమే కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం శ్రీ చైతన్య విద్యా సంస్థలల్లో జరుగుతున్న అవినీతి,ఫీజుల దోపిడీ పై ఉక్కుపాదం మోపేలా ఈడి , సిబిఐ దర్యాప్తు సంస్థలతో విచారణ చేపట్టేలా అదేశించాలని డిమాండ్ చేస్తున్నాం.అదే విధంగా శ్రీ చైతన్య విద్యాసంస్థల్లో చనిపోయిన విద్యార్థుల మరణాలపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలి.2025-2026 విద్యా సంవత్సరానికి శ్రీ చైతన్య విద్యా సంస్థలలో అడ్మిషన్లను నిలిపి వేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి గారిని కోరుతున్నాము. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు

# ఒక్కో ఎంబీబీఎస్ సీటుకు నలుగురు పోటీ!

### రాష్ట్రంలో 3,856 కన్వీనర్ కోటా సీట్లకు డిమాండ్

### మొత్తం 13,850 మంది విద్యార్థుల దరఖాస్తు



అమరావతి: రాష్ట్రంలో 2024-25 విద్యా సంవత్సరానికి కన్వీనర్ కోటాలో ఎంబీబీఎస్ సీట్లకు తీవ్ర పోటీ నెలకొంది. కన్వీనర్ కోటాలో మొత్తం 3,856 సీట్లు ఉండగా.. వీటికి 13,850 మంది విద్యార్థులు దరఖాస్తు చేశారు. ఒక్కో సీటుకు దాదాపు నలుగురు విద్యార్థులు పోటీ పడుతున్నారు. యాజమాన్య కోటా (ఎంక్యూ) సీట్లకు కూడా గతంతో పోలిస్తే దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల సంఖ్య పెరిగింది. గత విద్యా సంవత్సరంలో ఎంక్యూ సీట్లకు 3,500 మందికి పైగా దరఖాస్తు చేసుకోగా ఈసారి ఇప్పటివరకు 4,136 మంది నమోదు చేసుకున్నారు.

**సీట్ వస్తుందో.. లేదో**

నీట్ యూజీలో మంచి స్కోర్ సాధించిన వారికి అఖిల భారత స్థాయిలో ర్యాంక్‌లు పెరిగిపోవడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. మంచి స్కోర్ సాధించినప్పటికీ ఎంబీబీఎస్ సీటు వస్తుందో, లేదో అనే సందేహం చాలా మందిని వెంటాడుతోంది. మరోవైపు తెలంగాణ విద్యార్థులకు 15 శాతం కోటా రద్దు, స్థానికతపై తీసుకున్న నిర్ణయం, స్కోర్, ర్యాంక్‌ల తీరు మారడంతో కొంత అయోమయ పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో కళాశాలల వారీగా అందుబాటులో ఉన్న సీట్లను రిజర్వేషన్‌ల వారీగా ప్రకటిస్తే కొంత స్పష్టత వస్తుందని భావిస్తున్నారు.

**కొనసాగుతున్న రెండో విడత పరిశీలన**

విద్యార్థుల దరఖాస్తులను రెండు విడతల్లో ఆరోగ్య విశ్వవిద్యాలయంలో పరిశీలిస్తారు. అనంతరం మెరిట్ జాబితాలు ప్రకటిస్తారు. ఈ క్రమంలో కన్వీనర్ కోటా దరఖాస్తులకు సంబంధించి ఇప్పటికే తొలి విడత పరిశీలన పూర్తయింది. రెండో విడత కొనసాగుతోంది. ఇది కూడా పూర్తయ్యాక రెండు, మూడు రోజుల్లో ప్రాథమిక మెరిట్ జాబితా విడుదల చేసే అవకాశం ఉన్నట్టు ఆరోగ్య విశ్వవిద్యాలయ వర్గాలు తెలిపాయి. ఈ నెల 9 నుంచి కన్వీనర్ కోటా ప్రవేశాల కోసం దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభించగా 16తో గడువు ముగిసింది.

**భారీగా పెరిగిన కటాఫ్..**

ఇప్పటికే అఖిల భారత కోటా (ఏఐక్యూ) తొలి విడత కౌన్సెలింగ్ పూర్తయింది. విద్యార్థులకు సీట్లు కూడా కేటాయించారు. గతేడాదితో పోలిస్తే ఈసారి తొలి విడత కౌన్సెలింగ్‌లో భారీగా కటాఫ్ స్కోర్‌లు పెరిగాయి. దీంతో రాష్ట్ర కోటాలో పోటీ పడుతున్న విద్యార్థులు తాము సాధించిన మార్కులకు సీటు వస్తుందో, రాదోననే ఆందోళనలో ఉన్నారు. గతేడాది ఏఐక్యూ తొలి విడత కౌన్సెలింగ్‌లో అన్ రిజర్వుడ్ విభాగంలో 618 స్కోర్ వరకు సీటు లభించింది. ఈ ఏడాది కటాఫ్ స్కోర్ 42 పెరిగి 660 స్కోర్‌కు చివరి సీటు వచ్చింది. అదేవిధంగా ఈడబ్ల్యూఎస్ కోటాలో గతేడాది 613 మార్కులకు సీటు వస్తే ఈసారి 654 మార్కులు వచ్చినవారికి చివరి సీటు దక్కింది. వాస్తవానికి రాష్ట్రంలో 600 స్కోర్‌కు పైన చేసిన విద్యార్థుల్లో చాలా మంది అఖిల భారత కోటాలో సీట్లు పొందుతుంటారు. దీంతో రాష్ట్ర వాటా సీట్లలో కొత్త వారికి అవకాశం లభించేది. అయితే ఏఐక్యూ కటాఫ్ గణనీయంగా పెరగడం చూసి.. రాష్ట్రంలో కూడా ఇవే పరిస్థితులు నెలకొనే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.

# పీఎం కేర్.. చిల్డ్రన్ వెల్ఫేర్

**కోవిడ్ కారణంగా దేశవ్యాప్తంగా తల్లిదండ్రుల్ని కోల్పోయిన పిల్లల సంఖ్య 4,532**

**అత్యధికంగా మహారాష్ట్రలో 855 మంది పిల్లలు తల్లిదండ్రుల్ని కోల్పోయారు**

**వారందరికీ కేంద్రీయ విద్యాలయాల్లో ప్రత్యేక సీట్లతో ఉచిత చదువులు**

**పీఎం కేర్ కింద ప్రతి బిడ్డకు పోస్టాఫీసులో రూ.10 లక్షల డిపాజిట్**

**18-23 సంవత్సరాల మధ్య వయసులో నెలవారీ స్టైఫండ్**

**బంధువుల వద్ద ఆశ్రయం పొందుతున్న పిల్లలకు నెలకు రూ.4,000**

**తల్లిదండ్రుల్లో ఒకరిని కోల్పోయిన పిల్లల సంఖ్య 1,82,671**

**23 సంవత్సరాలు నిండిన తరువాత రూ.10 లక్షలు మంజూరు**

**మిషన్ వాత్సల్య కింద పిల్లల విద్య, ఆరోగ్య సంరక్షణ బాధ్యతలు**

**లోక్‌సభలో వెల్లడించిన కేంద్ర ప్రభుత్వం**

**కలెక్టర్ల నుంచి సేకరించి..**





తల్లిదండ్రులిద్దరినీ కోల్పోయిన పిల్లల వివరాలను రాష్ట్రాల వారీగా జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో పీఎం కేర్ ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేసినట్టు కేంద్ర మహిళా శిశు అభివృద్ధి శాఖ మంత్రి అన్నపూర్ణాదేవి లోక్‌సభలో వెల్లడించారు. ఇప్పటివరకు దేశంలోని అన్ని రాష్ట్రాల్లో పీఎం కేర్ పోర్టల్‌లో కోవిడ్-19 కారణంగా తల్లిదండ్రులిద్దరినీ కోల్పోయిన పిల్లలు 4,532 మంది నమోదైనట్టు కేంద్ర మంత్రి తెలిపారు. దేశంలో అత్యధికంగా మహారాష్ట్రలో 855 మంది పిల్లలు తల్లిదండ్రులిద్దరినీ కోల్పోయారు. పీఎం కేర్ పోర్టల్‌లో నమోదైన 4,532 మంది పిల్లలకు 18 సంవత్సరాలు నిండాక ప్రతి బిడ్డకు రూ.10 లక్షల చొప్పున పోస్టాఫీస్‌లో కార్పస్ ఫండ్ కింద జమ చేస్తున్నట్టు కేంద్ర మంత్రి వివరించారు. పోస్టాఫీసు నెలవారీ ఆదాయ పథకంలో 10 లక్షల కార్పస్‌ను పెట్టుబడి పెట్టడం ద్వారా 18 సంవత్సరాల నుంచి 23 సంవత్సరాల మధ్య పిల్లలకు నెలవారీ స్టైఫండ్‌ను ఇస్తారని, 23 సంవత్సరాల నిండిన తరువాత రూ.10 లక్షలు మంజూరు చేస్తారని వెల్లడించారు. బందువుల దగ్గర ఉంటున్న 18 ఏళ్లలోపు పిల్లలకు మిషన్ వాత్సల్య పథకం కింద నెలకు రూ.4,000 చొప్పున మహిళా శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఇస్తుందని మంత్రి పేర్కొన్నారు. పిల్లల సంరక్షణ, ఇన్‌స్టిట్యూట్‌లో ఉండే పిల్లలకు బోర్డింగ్, లాడ్జింగ్ సౌకర్యాలను ప్రభుత్వమే కల్పిస్తుందని మంత్రి తెలిపారు. ఈ పిల్లలు 1వ తరగతి నుంచి 12వ తరగతి వరకు చదువుకునేందుకు వీలుగా కేంద్రీయ విద్యాలయాల్లో ప్రత్యేకంగా అడ్మిషన్లు ఇచ్చినట్టు పేర్కొన్నారు.

**పూర్తి ఫీజు మినహాయింపుతో..**


కోవిడ్ కారణంగా తల్లిదండ్రుల్ని కోల్పోయిన పిల్లలను ఒక్కో కేంద్రీయ విద్యాలయంలో ప్రత్యేకంగా 10 మంది చొప్పున చేర్చు కుంటున్నారు. ఆ పిల్లలకు పూర్తిగా ఫీజు మినహాయింపు ఉంది. స్కూల్‌కు వెళ్లే పిల్లలందరికీ స్కాలర్‌షిప్ కింద రూ.20 వేల చొప్పున ఇస్తారు. వీరంతా ఆయుష్మాన్ భారత్-ప్రధానమంత్రి జన ఆరోగ్య యోజన కింద రూ.5 లక్షల ఆరోగ్య బీమా కవరేజీతో నమోదయ్యారు. వారికి 23 సంవత్సరాలు వచ్చే వరకు ఆరోగ్య బీమా కవరేజి వర్తిస్తుంది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు.. కోవిడ్ కారణంగా తల్లిదండ్రుల్లో ఒకరిని కోల్పోయిన పిల్లల వివరాలను బాలస్వరాజ్ పోర్టల్‌లో నమోదు చేశారు. ఈ కేటగిరీలో అన్ని రాష్ట్రాల్లో కలిపి 1,82,2671 మంది పిల్లలు నమోదయ్యారు. వీరి సంరక్షణ, విద్య, ఆరోగ్య బాధ్యతలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. మిషన్ వాత్సల్య పథకం కింద, పిల్లల సంరక్షణ సంస్థల ద్వారా వారి సంరక్షణ చర్యలను చేపడుతున్నారు. తల్లిదండ్రుల్లో ఒకరిని కోల్పోయిన పిల్లలు అత్యధికంగా ఒడిశాలో 34,160 మంది, మహారాష్ట్రలో 27,302 మంది, ఉత్తర ప్రదేశ్‌లో 19,437 మంది, తమిళనాడులో 15,395 మంది, గుజరాత్‌లో 13,802 మంది, మధ్యప్రదేశ్‌లో 11,413 మంది ఉన్నారు.

## ముంబై తో సమానంగా గణేష్ ఉత్సవాలు..



**హైదరాబాద్, :** ముంబై తో సమానంగా గణేష్ ఉత్సవాలు హైదరాబాద్ లో నిర్వహణ జరుగుతుందని రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కాగా.. వినాయకచవితి సమీపిస్తుండటంతో నగరంలో వినాయక ప్రతిమలు విభిన్న రూపాల్లో అందంగా రూపుదిద్దుకుంటున్నాయి. దీంతో కొన్ని చోట్ల విగ్రహాల విక్రయాలూ జోరందుకున్నాయి. ఈనేపథ్యంలో.. గణేష్ ఉత్సవాలు ఏర్పాట్ల పై ఏంసిఆర్ హెచ్ ఆర్ డిలో మంత్రి సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్ గౌడ్, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, మేయర్ గద్వాల విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి, హైదరాబాద్ సీపీ కొత్త కోట శ్రీనివాస్ రెడ్డి, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ కమిటీ, బాలాపూర్ గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. ముంబై తో సమానంగా గణేష్ ఉత్సవాలు మనం జరుపుకుంటామన్నారు. ఏ ప్రభుత్వం ఉన్నా అన్ని ఏర్పాట్లు చేస్తాయన్నారు. ఇందుకు ప్రజల సహకారం కూడా చాలా అవసరమని తెలిపారు. ఇప్పటికే పోలీస్ కమిషనర్లు అన్ని రకాల సర్వే లు నిర్వహించారన్నారు. మా ప్రభుత్వం ఏర్పడ్డాక ఇది మొదటి గణేష్ పండుగ అని తెలిపారు. అందరి సహకారంతో ఈ పండుగ ఘనంగా నిర్వహిస్తామన్నారు. ఇక మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం లానే ఈ సారి కూడా గణేష్ ఉత్సవ ప్రిపరేషన్ మీటింగ్ ఏర్పాటు చేశామన్నారు. హైదరాబాద్ ఇన్చార్జి మంత్రిగా వ్యవహరిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్ పర్యవేక్షణ లో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఇక్కడికి వచ్చిన కమిటీ సభ్యులకు ఎన్నో ఏళ్ల అనుభవం ఉందన్నారు. గ్రేటర్ హైదరాబాద్ కి సంభందిచిన ఈ గణేష్ ఉత్సవాలకు మీ సలహాలు తీసుకుని ముందుకు వెళ్లాలని నిర్ణయించామన్నారు. పెద్దలు ఇచ్చే సూచనలు తీసుకుని గణేష్ ఉత్సవాలు జరిపించాలని అధికారులను కోరుతున్నామని తెలిపారు. హైదరాబాద్ సీపీ కొత్త కోట శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. ఇప్పటికే మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు ఏర్పాట్లపై సమీక్ష ప్రారంభించామన్నారు. గణేష్ ఉత్సవాల బందోబస్తు ముంబై తో సమానంగానే ఉన్నామన్నారు. గత సంవత్సరం కూడా 50 వేలకు పైగానే విగ్రహాలు వెలిశాయన్నారు. గణేష్ ఉత్సవ బందోబస్తు చాలా పెద్దదే అని, GHMC, ఇతర వ్యవస్థలతో కో ఆర్డినేట్ చేసుకుని పోలీస్ శాఖ పనిచేస్తుందన్నారు. నిమజ్జనం సమయంలో అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. క్రేన్ల ఏర్పాటు కూడా డిఫెక్ట్ లేని వాటిని సెలెక్ట్ చేసుకోవాలన్నారు. క్రేన్ కి ఆల్టర్నేట్ డెవర్లను కూడా అందుబాటులో ఉండేలా చూసుకుంటే..ఆలస్యం జరగకుండా నిమజ్జనం జరుగుతుందని సీపీ తెలిపారు.

## 14 రాష్ట్రాలకు ఐఎండీ అలర్ట్.. భారీ వర్షాలు కురుస్తాయని వెల్లడి..!





న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా రుతు పవనాలు చురుగ్గా కదులుతున్నాయి. ఈ నేపథ్యంలో భారత వాతావరణ శాఖ పలు రాష్ట్రాలకు వర్ష సూచనలు చేసింది. పలు ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరికలు జారీ చేసింది. ఈ క్రమంలో గుజరాత్‌కు రెడ్ అలర్ట్ ప్రకటించింది. రాబోయే రెండు, మూడు రోజులు రాష్ట్రంలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొనింది. ఐఎండీ గుజరాత్‌ను 'ఫ్లాష్ ఫ్లడ్ రిస్క్' జోన్‌గా ప్రకటిస్తూ ఆదేశాలు జారీ చేసింది. కాగా, వర్షాల నేపథ్యంలో గుజరాత్‌లోని అన్ని ప్రాథమిక పాఠశాలలను ఇవాళ (మంగళవారం) మూసి వేస్తున్నట్లు విద్యా మంత్రి ప్రఫుల్ పన్షేరియా వెల్లడించారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు గుజరాత్ రాష్ట్రంలో బీభత్సం సృష్టిస్తున్నాయి. ఈ నేపథ్యంలో అనేక లోతట్టు ప్రాంతాలను వరద నీరు ముంచెత్తింది. వర్షం కారణంగా రాష్ట్రంలో ఇప్పటి వరకు ముగ్గురు వ్యక్తులు చనిపోగా. మరో ఏడుగురు తప్పిపోయారు. అయితే, ఇవాళ ఢిల్లీతో పాటు 14 రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసింది. రాజస్థాన్‌లో గంటకు 60 కిలో మీటర్ల వేగంతో తుపాను వచ్చే ఛాన్స్ ఉందని ఐఎండీ తెలిపింది. గుజరాత్, మహారాష్ట్ర, బెంగాల్ రాష్ట్రాల్లో గంటకు 50 నుంచి 55 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని పేర్కొనింది. ఇక, సముద్రంలో అలలు ఎగసిపడే ఛాన్స్ ఉందని ఐఎండీ సూచనలు జారీ చేసింది. వాతావరణ శాఖ తెలిపిన వివరాల ప్రకారం.. రానున్న 24 గంటల్లో ఢిల్లీ, పంజాబ్, హర్యానా, గుజరాత్, రాజస్థాన్, పశ్చిమ బెంగాల్, జార?ండ్, బీహార్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, చండీగఢ్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, హిమాచల్, జమ్మూ కశ్మీర్, ఉత్తరాఖండ్, కర్ణాటకలో వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. అయితే, తెలంగాణలో వచ్చే ఆరు రోజులు కూడా వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ వెల్లడించింది. ఏపీలో మూడు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది.

## రైతు రుణ మాఫీ పై యాప్ పని ప్రారంభించింది..

**హైదరాబాద్, :** రైతులు ఆందోళన చేయాల్సిన అవసరం లేదని రైతుల రుణమాఫీ అందరికీ వర్తింప చేస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వరావు అన్నారు. ఖమ్మం జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ముందు వామపక్షాలు అందరికీ రైతు రుణమాఫీ వర్తింప జేయాలని ధర్నా చేస్తుండగా అదే సందర్భంలో కలెక్టర్ కార్యాలయం నుంచి రివ్యూ చేసి బయటకు వచ్చారు. దీంతో మంత్రి తుమ్మల నాగేశ్వరావు ని వామపక్షాలు అడ్డుకున్నారు. అయితే మంత్రి తుమ్మల నాగేశ్వరావు కారు దిగి వామపక్షాల వద్ద వచ్చి వారితో చర్చలు జరిపారు. తమ ప్రభుత్వం రైతు రుణమాఫీకి కట్టుబడి ఉందని తెలిపారు. ఎవరు ఇప్పుడు ఆందోళనలు ధర్నాలు చేయాల్సిన సమయం సందర్భము కాదని అన్నారు. రైతు రుణమాఫీకి సంబంధించిన యాప్ పనిచేయటం మొదలుపెట్టిందని క్లారిటీ ఇచ్చారు. అందరికీ రుణమాఫీని అందజేస్తామని తుమ్మల నాగేశ్వరావు అన్నారు. ఇంటింటికి వచ్చి రైతు అప్పులు, రుణ మాఫీ పై సర్వే జరుగుతుందన్నారు. యాప్ లో అందరి వివరాలు వుంటాయని తెలిపారు. గత ప్రభుత్వం మాదిరిగా తమ ప్రభుత్వం తూ తూ మంత్రంగా రుణ మాఫీ చెయ్యమని తెలిపారు. పక్కాగా అర్హులైన రైతు లందరికి రుణమాఫీ జరుగుతుందని మంత్రి తెలిపారు.ు

## హైడ్రా జిల్లా లో సైతం రావాలి
### సిద్దిపేట్ ఎన్. హెచ్.ఆర్సీ

సిదిపేట్ కలెకరేట్ లో వినతిపతం అందజేత




సిద్దిపేట అర్బన్ - ప్రభాత సూర్యుడు: హైదరాబాద్ తో పాటు వివిధ జిల్లాలో కూడా ఏర్పాటు కు డిమాండ్ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన హైడ్రా కార్యక్రమం హైదరాబాద్ తో పాటు వివిధ జిల్లాలో కూడా కొనసాగించాలని సిద్దిపేట్ జిల్లా జాతీయ మానవ హక్కుల కమిటీ హైడ్రాకు మద్దతు తెలుపుతూ మంగళవారం నాడు జిల్లా కలెక్టర్ కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జాతీయ మానవ హక్కుల కమిటీ సభ్యులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన హైడ్రా కార్యక్రమం అక్రమ కూల్చివేత పై జాతీయ మానవ హక్కుల జిల్లా కమిటీ ప్రభుత్వానికి మద్దతు తెలుపుతూ గతంలో జిల్లాలో అక్రమ కబ్జాలు అక్రమ కట్టడాలు ఎన్నో ఉన్నాయని వాటిపైన కూడా జిల్లాలో హైడ్రా కార్యక్రమం నిర్వహించి అక్రమాలను తొలగించి పేద ప్రజలకు మేలు చేసే విధంగా చేయాలని కోరారు,ఇదేవిధంగా ప్రతి జిల్లాలో కూడా హైడ్రా కార్యక్రమం నిర్వహించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో జాతీయ మానవ హక్కుల కమిటీ సిద్దిపేట్ జిల్లా అధ్యక్షులు,మండల అధ్యక్షులు,తదితరులు పాల్గొన్నారు..

# ఎట్టకేలకు ఒక కదలిక




రథం కదులుతోంది. ఎప్పుడో జరగాల్సిన పనిలో ఇప్పటికైనా అడుగులు ముందుకు పడుతున్నాయి. దేశంలో జనాభా లెక్కల పని ఎట్టకేలకు మరికొద్ది రోజుల్లోనే సెప్టెంబర్‌లో ఆరంభ మవుతోంది. ఆ మేరకు ఇటీవల వెలువడ్డ సమాచారం పెద్ద ఊరట. ప్రతి పదేళ్ళకు ఒకసారి జరగాల్సిన ఈ జనగణన యజ్ఞం నిజానికి 2021లోనే జరగాల్సి ఉంది. కోవిడ్ సహా అనేక సాకులతో ప్రభుత్వం సాచివేత ధోరణి ప్రదర్శిస్తూ వచ్చింది. అయితే, భారత్ లాంటి వర్ధమాన దేశానికి జనగణన మినహా ప్రత్యామ్నాయ మార్గాలలో ఆ స్థాయి సమాచారం అందుబాటులో లేదు. ఉన్నా అది అంత నమ్మదగినదీ కాదు. అందుకే జనాభా పరంగా, సామాజిక – ఆర్థికపరంగా దేశ సమగ్ర స్వరూపాన్ని ఆవిష్కరించడానికి కొన్ని దశాబ్దాలుగా జనగణన అత్యంత కీలకమైనది. అలాంటి జనగణన ప్రక్రియ ఇప్పుడు మళ్ళీ పట్టాలెక్కుతోంది. వచ్చే నెల (సెప్టెంబర్)లో ఆరంభ మయ్యే ఈ ప్రక్రియ పూర్తి కావడానికి దాదాపు ఏణ్ణర్ధ కాలం పడుతుందని ప్రభుత్వం మాట. జనగణన అనేది పలువురు పొరబడుతున్నట్టు కేవలం గణాంకాల సేకరణ కాదు. అది సుపరి పాలనకు మూలస్తంభం. దేశం ఎదుర్కొనే సామాజిక, ఆర్థిక సవాళ్ళకు పరిష్కారాలు కనుగొనేందుకు మార్గదర్శి. పట్టణీకరణ, ప్రాథమిక వసతుల అభివృద్ధి మొదలు సాంఘిక సంక్షేమం, ఆర్థిక ప్రణాళిక వరకు ప్రతి అంశం పైనా సరైన విధాన నిర్ణయాలకు ఈ సమాచారమే కీలకం. నిజానికి, జనాభా లెక్కల సేకరణలో కేంద్ర సర్కార్ చేసిన సుదీర్ఘ జాప్యం చాలాకాలంగా విమర్శలకు గురవుతోంది. ప్రైవేట్‌వారే కాదు... సర్కారీ ఆర్థిక నిపుణులు సైతం విమర్శకుల్లో ఉండడం గమనార్హం. పాత జనాభా లెక్కల ఆధారంగానే ఇప్పటికీ ఆరోగ్యం, ఆర్థిక అంశాలు, చివరకు ద్రవ్యోల్బణం రేటు, ఉపాధి లెక్కల లాంటివన్నీ గణిస్తూ ఉండడం వల్ల కచ్చితత్వం లోపిస్తోంది. డేటా లోపంతో కనీసం 15 కీలక అంశాలపై దుష్ప్రభావం పడింది. అదే ఈ నిపుణులందరి బాధ. పుష్కర కాలం క్రితపు లెక్కలపై ఆధారపడే సరికి అంతా లోపభూయిష్టమైంది. దాదాపు 10 కోట్ల మంది పౌర సరఫరా వ్యవస్థకు వెలుపలే ఆహారభద్రత లేకుండా మిగిలిపోయారు. ఇళ్ళు, శ్రామికుల సంఖ్య ఆధారంగా రాష్ట్రాలకు కేంద్రం కేటాయించే జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులపైనా దెబ్బ పడింది. చివరకు నేషనల్ శాంపుల్ సర్వే ఆఫీస్ వారి సర్వేల నాణ్యత కూడా దెబ్బతింది. అంతెందుకు... జనాభాలో చైనాను భారత్ దాటేసి, ప్రపంచంలోనే అత్యధిక జనాభా గల దేశంగా అవతరించినట్టు ఐరాస నివేదిక గత ఏడాది ప్రకటించింది. దాన్ని ఖరారు చేయడానికో, కాదనడానికో, ఆ జనాభా లెక్కకు అనుగుణంగా అవసరమైన చర్యలు చేపట్టాడానికో కూడా మన వద్ద నిర్దుష్టమైన గణాంకాలు లేని పరిస్థితి. అలాంటి లోపాలన్నీ సరిదిద్దుకోవడానికి ఇప్పుడిది సదవకాశం. అదే సమయంలో జనగణనలో భాగంగా మన జనాభా తాలూకు కులగణన కూడా చేయడం అత్యవసరం. దేశంలోని ప్రధాన పార్టీలన్నీ కోరుతున్నది అదే. తద్వారా జనసంఖ్యలో ఏ సామాజిక వర్గం వంతు ఎంత, ఏయే వర్గాల స్థితిగతులు ఏమిటి, ఏ వర్గాలు ఎంతగా వెనకబడి ఉన్నాయి తదితర భోగట్టా తేటతెల్లమవుతుంది. కులాలు, ఉపకులాలతో పాటు వర్తమానంలో కనుమరుగైపోతున్న ఆశ్రిత కులాల లెక్కలూ వెలికివస్తాయి. వెనుకబడిన వర్గాలకు చేయూతనిచ్చేలా పాలకులు పాలసీలు చేయడానికీ వీలవుతుంది. ప్రణాళిక, పాలన, చట్టాల రూపకల్పన సహా అనేక ప్రభుత్వ కార్యక్రమాలపై సమీక్షకూ, నిర్వహణకూ ఈ సమాచారమంతా ఉపకరిస్తుంది. తాజా జనగణన రాజకీయంగానూ ప్రధానమే. దేశంలోని అన్ని స్థాయుల చట్టసభలలో నియో జక వర్గాల పునర్విభజన, రిజర్వేషన్‌కు ఈ కొత్త లెక్కలే ఆధారమవుతాయి. అంటే, అసెంబ్లీ, పార్ల మెంట్ స్థానాల సంఖ్య మారిపోనుంది. ఈ లెక్కన దక్షిణాదితో పోలిస్తే జనాభా నియంత్రణ అంతగా లేని ఉత్తరాదిలో మరిన్ని చట్టసభా స్థానాలు వస్తాయి. ఫలితంగా అధికార సమీకరణాలూ మారి పోతాయి. ఇంతటి ముఖ్యమైనది కాబట్టే... ఇలాంటి అధికారిక గణాంక వ్యవస్థను ప్రభుత్వ, రాజ కీయ జోక్యాలకు వీలైనంత దూరంగా ఉంచడం శ్రేయస్కరం. మారిన కాలానికి అనుగుణంగా కొత్త జనగణన రూపురేఖలూ మారుతున్నాయట. ప్రధానంగా డిజిటల్ పద్ధతిలో, అదీ స్వీయ నమోదు పద్ధతిలో జనగణన సాగనుంది. గతంలో స్త్రీ, పురుషుల వివరాలనే దఖలు పరిస్తే, ఇప్పుడు తొలి సారిగా ట్రాన్స్‌జెండర్ల వివరాలనూ ప్రత్యేకంగా నమోదు చేయనున్నారు. అలాగే, ఎస్సీ, ఎస్టీలే కాక 'ఇతర వెనుకబడిన వర్గాలు' అంటూ వివరాలు విడిగా నింపనున్నారట. ఏమైతేనేం, ఇన్నేళ్ళ తరువాతైనా జనాభా లెక్కల ప్రక్రియను మళ్ళీ చేపట్టడం హర్షణీయం. అతి ముఖ్యమైన బృహత్ యజ్ఞాన్ని ఇక నుంచైనా ఎప్పటికప్పుడు నిర్ణీత సమయానికే నిర్వహించడం అత్యవసరం. తద్వారానే కచ్చితమైన డేటా దేశంలో పాలనా యంత్రాంగానికి అందుబాటులోకి వస్తుంది. 2026 మార్చి కల్లా ఈ జనగణన ఫలితాలను సమర్పించేందుకు కేంద్ర శాఖలు ఇప్పటికే నిర్ణీత కాలవ్యవధి ప్రణాళికలు సిద్ధం చేసుకున్నాయి. దీంతో, 2011 నుంచి అప్పటి దాకా... అంటే 15 ఏళ్ళ కాలవ్యవధిలోని సమాచారం చేతిలోకి వస్తుంది. అయితే, ఈసారి జరిగిన జాప్యం నుంచి పాఠాలు నేర్చుకోవాలి. దేశం ముందుకు సాగడానికి దాని సమూహ స్వరూప స్వభావాలు దానికైనా తెలిసి ఉండడం ముఖ్యం. అలాంటి సమాచార సేకరణ, వినియోగంలో అంతరాయాలు రాకుండా జాగ్రత్తపడాలి. ఊహించని ఆటంకాలు ఎదురైనా ఇబ్బంది పడకుండా ఉండేలా జనాభాపై సమగ్ర సమాచారం అందించే కట్టుదిట్టమైన వ్యవస్థలను సిద్ధం చేసుకోవాల్సిన అవసరం ఉంది. అలాంటి ప్రయత్నాలు జరగడానికి ఇదే తరుణం.

# గాజాపై ఇజ్రాయిల్ దాడులు ఉధృతం



హిజ్బుల్లాల ప్రతిఘటనతో లెబనాన్పై వెనక్కి.. శ్రీ కాల్పుల విరమణ ఒప్పందానికి కొత్త షరతులుజెరూసలెం : అమెరికా అండతో గాజాపై ఇజ్రాయిల్ దాడులను మరింత తీవ్రతరం చేసింది. లెబనాన్పై దాడికి హిజ్బుల్లాల నుంచి తీవ్ర ప్రతిఘటన ఎదురుకావడంతో కొంచెం వెనక్కి తగ్గిన ఇజ్రాయిల్ సైన్యం గాజాపై మాత్రం తన ప్రతాపాన్ని చూపిస్తున్నాయి. గాజా సిటీ నుంచి ఖాళీ చేయాలని ఇజ్రాయిల్ మరో హుకుం జారీ చేయడంతో గాయాలతో నడవలేని స్థితిలో ఉన్న పాలస్తీనీయులు సెంట్రల్ గాజాలోని అల్ అక్సా ఆస్పత్రిలో తలదాచుకునేందుకు వెళ్తుండగా వారిపై ఇజ్రాయిల్ డ్రోన్లతో దాడులు చేసి ఏడుగురిని బలి తీసుకుంది. లెబనాన్ దక్షిణ సరిహద్దుపై భారీగా యుద్ధవిమానాలతో దాడి చేయగా, దీనికి హిజ్బుల్లాలు గట్టిగా సమాధానమిచ్చారు. దీంతో లెబనాన్పై దాడుల నుంచి కొంచెం వెనక్కి తగ్గింది. కాల్పుల విరమణ, బందీల పరస్పర మార్పిడి కోసం ఈజిప్టు రాజధాని కైరోలో జరుగుతున్న చర్చలు ఒకడుగు ముందుకు రెండడుగులు వెనక్కి అన్న చందంగా సాగుతున్నాయి. ఇజ్రాయిల్ విధించిన కొత్త షరతులను హమాస్ తిరస్కరించింది. ఐరాస భద్రతా మండలి, అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ చేసిన ప్రతిపాదనలకు ఇజ్రాయిల్ కట్టుబడి ఉండాలని హమాస్ డిమాండ్ చేసింది. లెబనాన్, ఇజ్రాయిల్ మధ్య దాడులు ప్రతి దాడులతో పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో ఆదివారం రద్దు చేసిన తమ విమానాలను జోర్డానియన్ ఎయిర్లైన్స్ సోమవారం పునరుద్ధరించింది. గత 10 మాసాలుగా గాజాపై ఇజ్రాయిల్ అత్యంత పాశవికంగా సాగిస్తున్న దాడులను తాత్కాలికంగా నిలుపుచేసేందుకు జరుగుతున్న చర్చలు ఎలాంటి తుది ఒప్పందం కుదరకుండానే ముగిశాయి. గాజాలో కాల్పుల విరమణ ఒప్పందం కుదిరితే తమ దాడులు ఆపేస్తామని హిజ్బుల్లా నాయకుడు హసన్ నస్రల్లా అంతకుముందు తెలిపారు. ఆదివారం నాటి




ప్రతీకార చర్య సరిపోనట్లైతే తర్వాత స్పందించే హక్కును తాము అట్టిపెట్టుకున్నామని హమాస్ నేత ఇజ్రాయిల్ను హెచ్చరించారు. ఇజ్రాయిల్, లెబనాన్లో పరిణామాలను నిశితంగా పరిశీలిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ వ్యాఖ్యానించారు.

**ఇజ్రాయిల్తో ఉద్రిక్తతలను పెంచాలనుకోవడం లేదు**

ఇజ్రాయిల్తో ఉద్రిక్తతలను పెంచాలని భావించడం లేదని ఇరాన్ సోమవారం పేర్కొంది. టెహ్రాన్లో హమాస్ చీఫ్ హత్యకు 'ఖచ్చితమైన , నిశ్చయాత్మకమైన' ప్రతిస్పందన ఉంటుందని ఇరాన్ విదేశీ మంత్రి అబ్బాస్ అరాక్చీ తెలిపారు. ఇరాన్ ఉద్రిక్తతలను పెంచడానికి ప్రయత్నించదని, దాడులకు భయపడదని ఆ దేశ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాక్చీ ఇటలీ విదేశాంగ మంత్రి ఆంటోనియో తజానీతో ఫోన్ సంభాషణలో పేర్కొన్నారు. టెహ్రాన్లో హమాస్ చీఫ్ ఇస్మాయిల్ హనియే జులై 31న ఇజ్రాయిల్ దాడిలో హత్యకు గురైన సంగతి తెలిసిందే. ఈ చర్య ఇరాన్ భద్రత, సార్వభౌమాధికారాన్ని తీవ్రంగా ఉల్లంఘించడమేనని ప్రభుత్వ మీడియాలో అబ్బాస్ అరాక్చీ వ్యాఖ్యానించారు. హనియే హత్యకు బాధ్యత వహిస్తున్నట్లు ఇజ్రాయిల్ ప్రకటించలేదు.. తిరస్కరించలేదు.

# చిత్తశుద్ధి ఎంత?



'మహిళల భద్రత ఎంతో ముఖ్యమైనది. మహిళలపై నేరాలు క్షమించరానివని ప్రతి రాష్ట్రానికి చెబుతున్నా. నేరస్థులు ఎవ్వరైనా సరే.. వారిని విడిచిపెట్టే ప్రసక్తే లేదు. మహిళలపై నేరాలకు పాల్పడేవారిపై కఠినంగా శిక్షించేందుకు చట్టాలను మరింత పటిష్ఠ పరుస్తున్నాం' ఇవి సాక్షాత్తు మన ప్రధానమంత్రి మోడీ చెప్పిన మాటలు. మహారాష్ట్రలోని లఖ్పతి దీదీ కార్యక్ర మంలో ప్రధానమంత్రిపై వ్యాఖ్యలు చేస్తున్న తరుణంలోనే గూగుల్ సెర్చ్ ఇంజిన్లో ప్రపంచంలో మహిళలకు అత్యంత ప్రమాదకరమైన దేశాలు ఇవిగో అంటూ ఒక జాబితా చెక్కర్లు కొట్టింది. ఆ జాబితాలో భారత్ రెండో స్థానంలో ఉంటడం ఆందోళన కలిగిస్తోంది. కోల్కతా దారుణ లైంగికదాడి ఘటనో లేదంటే.. ఇటీవల కాలంలో మహిళలపై పెరిగిపోతున్న అఘాయిత్యాల వల్లనో స్పష్టమైన కారణం తెలీదు కానీ, ప్రధాని మాట్లాడుతున్న తరుణంలోనే ఇది జరగడం విశేషం. అయితే ప్రధాని వ్యాఖ్యలు ఆహ్వా నించదగినవే గానీ, ఆచరణలో వారి ప్రభుత్వ తీరుపై పలు ప్రశ్నలు తలెత్తుతుండటం గమ నార్హం. ఉన్నావో లైంగికదాడి నిందితుల విషయంలో గానీ, బిల్కిస్ బానో ఘటనకు సంబంధించిన నిందితులకు గానీ జైలు నుంచి ఘనస్వాగతం పలికి బయటకు తీసుకు వచ్చిందెవరు? అలాంటి వారిపై తీసుకున్న చర్యలేమిటి? ఇప్పటికీ రావణకాష్టంలా మండుతున్న మణిపూర్ దురాగతంలో వెలుగు చూసిన దారుణాలెన్ని? వాటిలో ఎన్నింటిపై మీ ప్రభుత్వం చర్యలు తీసుకుంది? మీపార్టీ ఎంపీ మాపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్నాడు మహాప్రభో కాపాడండన్న మహిళా మల్లయోధులకు వీరు చేసిన న్యాయమేమిటి? ఇలాంటి ప్రశ్నలు ప్రధాని మాటల్లోని చిత్తశుద్ధిని ఎత్తి చూపుతున్నాయి. సంఘటన ఏదైనా నిందితులను కాపాడటానికి పాలకులే ప్రయత్నించడం అత్యంత హేయం. పైగా డ్రెస్సింగ్ విధానమే ఈ దాడులకు కారణమనే ప్రవచనాలు వింటున్నాం. చూస్తున్నాం. ఇటువంటి నేపథ్యంలో మహిళల భద్రత గురించి ప్రధాని మాటలు కేవలం కంటితుడుపు చర్య అనే అభిప్రాయాలు సర్వసాధారణం. సమాజంలో తలెత్తుతున్న కొన్ని సహించలేని ఘటనలు ఆవేదన కలిగిస్తాయి. చట్టాలెన్నున్నా ఆగకుండా సాగుతున్న ఆకృత్యాలపై ఏమీ చేయలేమా అన్న ఆక్రోశం రగిలిస్తాయి. ప్రకటనలు, ప్రచారార్భాటాలు తప్ప అఘాయిత్యాలపై పాలకులు ఏనాడూ నోరు మెదపడం లేదు. లేకపోతే నెలల చిన్నారులపై సైతం మృగాళ్ల అఘాయిత్యాలు ఎందుకు జరుగుతు న్నాయి? 'ఈ దుశ్శాసన పర్వానికి ముగింపు ఎప్పుడు? పైగా అన్యాయం జరిగిందని గొంతెత్తి అరుస్తున్నా స్పందించని నేలపైన న్యాయం ఊసెత్తటమే అన్యాయమై పోతున్నది. దుష్ట సంస్కృతీ వారసత్వం నేటికీ సమాజాన కొనసాగుతూనే ఉన్నది. నాడు 'భారతా'న ఒక్క దుశ్శాసనుడే ఉన్నాడు. నేడు వీధికొక్కడు కనపడుతున్నాడు. ఆధిపత్య పర్వంలో విహరిస్తున్నారు. 'బేటీ పడావ్ బేటీ బచావ్' నినాదం నేడు దేశపు నడి వీధిలో అణచివేయబడి హాహాకారాలు చేస్తున్నది. స్త్రీలను శక్తులుగా కొలిచే దేశం మనదని గొప్పలు చెప్పుకునే సాంస్కృతిక ప్రచార పటాటోపంలో 'నస్త్రీ స్వాతంత్ర్య మర్హతి' అని నొక్కి వక్కాణిస్తున్న తీరుకు కించిత్ విచారమూ ప్రకటించము. పాలకులే ప్రాచీన సంస్కృతి, సంప్రదాయాల పేరుతో స్త్రీని సొంతఆస్తిగా, బానిసగా చూస్తోంటే%శా% ఈ దుష్టత్వానికి అంతమెప్పుడు! లైంగికదాడి కేసులో శిక్ష అనుభవిస్తున్న డేరా బాబాకు హర్యానాలో ఎన్నికల వేళ పదేపదే పెరోల్ ఇస్తూ పోతుంటాం. గత నాలు గేండ్లలో ఆయన 234రోజులు జైలు బయటే ఉన్నారు. మైనర్ బాలిక లైంగికదాడి కేసులో జీవిత ఖైదులో ఉన్న మరో బాబా ఆశా రామ్ బాపూను ఆయుర్వేద చికిత్సకై తాజాగా బయటకు వదులుతాం. అన్ని వ్యవస్థలనూ నీరుగార్చి, అధికారం సహా అనేక బలహీనతలతో పాలకులు చేసే ఈ పాపాలన్నీ బాధి తులకు శాపాలు కాక మరేమవుతాయి? ఇంత జరుగుతున్నా స్పందించని మన ప్రధాని 'మహిళలపై దాడులకు పాల్పడిన వారిని వదిలిపెట్టం' అని ఢంకా బజాయించి మరీ చెబు తున్నారు. మాట్లాడే మాటలకు, చేతలకూ ఉన్న వ్యత్యాసం అనేకసార్లు తెటతెల్లం అవుతూనే ఉంది. నీతులు, ధర్మాలు వల్లించేవారి నిజస్వరూపమేమిటో బయటపెడుతూనే ఉంది. 2012 నాటి 'నిర్భయ' ఘటన తర్వాత కఠినచట్టాలు చేసినా పరిస్థితులు మారలేదంటే లోపం ఎక్కడున్నట్టు? వావి వరుసలు లేవు, వయసులో చిన్నాపెద్దా విచక్షణ లేదు. చట్టం పట్ల భయభక్తులు అసలే లేవు. ఇలా ఉచ్చం నీచం మరిచి, చివ రకు చిన్నారులపైనా మనుషులు మృగాలుగా మారడానికి దారి తీస్తున్న సాంఘిక, మానసిక పరిస్థితుల్ని లోతుగా అధ్య యనం చేయా ల్సిన అవసరం ఉంది. మన వెనకాలే ఊడలు దిగుతున్న ఈ వికృత ధోర ణిని పెంచి పోషిస్తున్న మన వినోద, వినిమయ సంస్కృతులు, వైయక్తిక ప్రవర్తనల్ని సమీక్షించుకోవాల్సి ఉంది. ఈ భూతాన్ని ఆపేదెలా అని సత్వరమే ఆలోచించాల్సి ఉంది.



PRINTED, PUBLISHED & OWNED BY CHERUKU UPENDAR, PRINTED AT AKSHAYA PRINTERS, H.NO.7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR (V), ABDULLAPURMET (M), HAYATH NAGAR-501 505, RANGAREDDY DIST/HYDERABAD CITY, TELANGANA. EDITOR: CHERUKU UPENDAR, PUBLICATIONS AT HAMSA PUBLICATIONS, H.NO.7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR (V), ABDULLAPURMET (M), HAYATH NAGAR-501 505, RANGAREDDY DIST/HYDERABAD CITY, TELANGANA. EMAIL: PRABHATHASURYUDUEDITOR@GMAIL.COM, RNI: TELTEL12215